ప్రజాశక్తి
బుధవారం 9 ఏప్రిల్ 2025 5
శ్రీ సత్యసాయి

కియా దొంగలెవరు..?

◆ 900 ఇంజన్ల మాయంతో పరిశ్రమలో ప్రకంపనలు

◆ దర్యాప్తు ముమ్మరం చేసిన సిట్

◆ చోరీ గుట్టురట్టు చేస్తే అంతర్జాతీయ దొంగలు బయటపడే అవకాశం

అంతర్జాతీయ కార్లపరిశ్రమ కియాలో జరిగిన దొంగతనం ప్రకంపనలు సృష్టిస్తోంది. కియా కార్ల పరిశ్రమలో 900 కారు ఇంజన్లు దొంగతనం జరిగి చాలా రోజులే అవుతున్నా ఇది బయటకు రాకుండా గోప్యత పాటించారు. రెండు రోజుల క్రితం ఇది బహిర్గతం కావడంతో కియాలో దొంగలెవరు అన్నదానిపై జోరుగా చర్చ నడుస్తోంది. ప్రస్తుతం సిట్ ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది. దొంగతనం గుట్టు రట్టు చేస్తే ఈ వ్యవహారంలో అంతర్జాతీయ దొంగల హస్తం ఉటుందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం యర్రమంచి సమీపంలో కియా కార్లపరిశ్రమ ఉంది. మరో 25 అనుబంధ పరిశ్రమలున్నాయి. ప్రధాన కియా పరిశ్రమలో ప్రతిరోజూ 450కార్ల ఉత్పత్తి అవుతాయి. వీటికి అవసరమైన పరికరాలు వివిధ అనుబంధ పరిశ్రమల నుంచి కియా పరిశ్రమకు వస్తాయి. ఈ క్రమంలో 900కార్ల ఇంజన్లు మాయమైనట్లు కియా యాజమాన్యం గుర్తించింది. మార్చిలో జిల్లా ఎస్పీ రత్న కియా పరిశ్రమ పరిశీలనకు వెళ్లిన సమయంలో కియా సీఈఓ, ఎమ్‌డి ఎస్పీకి కారు ఇంజన్లు మాయమైన విషయాన్ని తెలియజేశారు. ఈ విషయం బయటకు తెలిస్తే ఇంజన్ మాయం చేసిన వారు అప్రమత్తం అవుతారని గోప్యంగా ఉంచమని కియా సిఈవో ఎస్పీని కోరారు. ఈ విషయంపై ఫిర్యాదు చేస్తే కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడతామని ఎస్పీ వారికి సూచించారు. దీంతో మార్చి 19న కియా యాజమాన్యం అమ్మవారిపల్లిలో ఉన్న కియా ఇండస్ట్రీయల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేర్‌హౌస్ ల్లో నా.. మార్గం మధ్యంలోనా..?

కియా కార్లకు దక్షిణ కొరియా నుంచి ఇంజన్లు ఓడల ద్వారా చెన్నైకి వస్తాయి. అక్కడి నుంచి కంటైనర్లలో కియా పరిశ్రమ అనుబంధ సంస్థల వేరే హౌస్‌లకు ఇంజన్లు చేరుతాయి. కార్లకు అవసరమైన ఇంజన్లు ప్రతిరోజు వేర్‌హౌస్‌ల నుంచి కియా పరిశ్రమకు కంటైనర్లలో వస్తాయి. ఈ ఇంజన్లు పరిశ్రమకు చేరకముందే మాయమై ఉంటాయా లేక వచ్చేదారిలో చోరీ జరిగిందా..? మరెక్కడైనా ఈ తంతు జరిగిందా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సిట్ బందంతో దర్యాప్తు

900 కారు ఇంజిన్ల మాయమైన విషయంపై స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) బృందం దర్యాప్తు చేపట్టింది. ఒక్కొక్క కారు ఇంజిన్ తక్కువ అనుకన్నా రూ.5 లక్షల విలువజేస్తుంది. ఆ లెక్కన 900 ఇంజన్ల ధర రూ.45 కోట్లు విలువ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంజన్ ఖరీదు ఎంత అనే విషయాన్ని యాజమాన్యం బహిర్గతం చేయలేదు. దొంగతనం పెద్దది కావడంతో సిట్ బందం దర్యాప్తును వేగవంతం చేసింది. కోట్ల విలువచేసే కారు ఇంజన్లు చోరీచేసి ఎక్కడ విక్రయించారా..? లేక తుక్కుకు వేశారా? దీనివెనుక అసలు సూత్రదారులు ఎవరు? అనే కోణంలో విచారణ జరుగుతోంది. ఈచోరీ గుట్టు రట్టు చేస్తే అంతర్జాతీయ దొంగల బండారం బట్టబయలు అయ్యే అవకాశం ఉంది.

ఓదార్చి.. భరోసానిచ్చి..!

◆ లింగమయ్య కుటుంబానికి వైఎస్.జగన్ పరామర్శ

◆ అండగా ఉంటామని హామీ

◆ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

◆ బీహార్‌లా చేస్తున్నారంటూ టిడిపిపై జగన్ మండిపాటు

◆ జనం తాకిడిలో హెలికాప్టర్‌కు సమస్య

◆ రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణం

జగన్ వచ్చిన సందర్భంగా పాపిరెడ్డిపల్లికి చేరుకున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో పది రోజుల క్రితం హత్యకు గురైన వైసిపి మద్దతుదారుడు కురుబ లింగమయ్య కుటుంబాన్ని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం ఉదయం బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో పాపిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అనంతరం తొలిసారిగా ఆయన సత్యసాయి జిల్లాకు విచ్చేయడంతో పెద్దఎత్తున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాపిరెడ్డిపల్లికి తరలివెళ్లారు. జగన్ హెలిక్యాప్టర్ దిగగానే పెద్దఎత్తున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చుట్టుముట్టారు. దీంతో కొంతసేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పాపిరెడ్డిపల్లి గ్రామానికి జగన్మోహన్‌రెడ్డి చేరుకున్నారు. కురుబ లింగమయ్య ఇంటికెళ్లారు. లింగమయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంట్లో కూర్చొని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఘటన జరిగిన రోజు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు.

శాంతిభద్రతలు క్షీణించాయి : వైఎస్.జగన్

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పారు. స్థానిక సంస్థల్లో తమకు బలం లేకున్నా తమవైపు తిప్పుకునేందుకు అనేక అప్రజాస్వామిక విధానాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుసరించారని మండిపడ్డారు. విశాఖపట్నం, తిరుపతి, రామకుప్పం, అత్తిలి తదితర ప్రాంతాల్లో ఇటువంటి ప్రయత్నాలు జరిగాయన్నారు. సత్యసాయి జిల్లా రామగిరి మండలంలోనూ ఎంపిటిసిలు ఎనిమిది మంది వైసిపి వాళ్లుంటే వారందరినీ భయపెట్టి టిడిపిలో చేర్చుకునేందుకు వివిధ రకాలుగా ఇక్కడి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆయన కుమారుడు పరిటాల శ్రీరామ్ ప్రయత్నించారన్నారు. దీనికి స్థానిక ఎస్ఐ సుధాకర్ మద్దతుగా వ్యవహరించారని పేర్కొన్నారు. వారి ప్రలోభాలకు లొంగకుండా వైసిపి ఎంపిటిసిలు గట్టిగా నిలబడ్డారన్నారు. అందుకు వారిని పోలీసు స్టేషన్‌లో బైండోవర్ చేసారని తెలిపారు. వారికి మద్దతుగా వెళ్లిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషచరణ్‌శ్రీ పైనా కేసులు నమోదు చేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా తమపార్టీకి మద్దతుగా నిలిచిన కురుబ లింగమయ్యపై 20 మంది టిడిపి మద్దతుదారులు దాడి చేసి హత్య చేసారని ఆరోపించారు. దాడిలో 20 మంది పాల్గొంటే కేసులు మాత్రం ఇద్దరిపైనే పెట్టారని మండిపడ్డారు. ఇదే రకంగా నంద్యాల, మహానంది, పెద్దకురపాడుల్లోనూ వైసిపి నాయకులపై టిడిపి వారు దాడులు చేశారని చెప్పారు. దాడులే కాకుండా మరికొంత మందిపై తప్పుడులు కేసు పెట్టి జైళ్లలో పెడుతున్నారన్నారు. పోసాని కృష్ణమురళి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నందిగామ సురేష్, వల్లభనేని వంశి తదితర నాయకులను జైళ్లలో పెట్టారని వివరించారు. పోలీసులను అడ్డంపెట్టుకని అప్రజాస్వామిక విధానాలను టిడిపి అవలంభిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు జరుగుతోందని యెద్దేవ చేశారు. పోలీసులు ఇదే తీరున వ్యవహరిస్తే తాము అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టబోమన హెచ్చరించారు. బట్టలూడదీసి వారిని చట్టం ముందు నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు సతీష్‌రెడ్డి, అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషచరణ్ శ్రీ, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

విరిగిన హెలికాప్టర్ విండ్‌షీల్డ్.. రోడ్డు మార్గంలో జగన్ తిరుగు ప్రయాణం..!

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి పాపిరెడ్డిపల్లి గ్రామం సమీపం వరకు హెలికాప్టర్‌లో విచ్చేశారు. ఆ సమయంలో అక్కడికి పెద్దఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు చేరుకుని హెలికాప్టర్‌ను చుట్టుముట్టారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితులే నెలకొన్నాయి. ఈ పరిస్థితుల నడుమ హెలికాప్టర్ విండ్ షీల్డ్ విరిగిపోయింది. దీంతో ఆ హెలికాప్టర్‌లో విఐపిని తీసుకెళ్లలేమని పైలెట్లు చెప్పడంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రోడ్డు మార్గంలో బెంగళూరుకు పయనమై వెళ్లారు. మాజీ ముఖ్యమంత్రి విచ్చేసిన సమయంలో పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యం చేశారంటూ వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెలిప్యాడ్ వద్ద భారీగా చేరిన వైసిపి శ్రేణులు

ఐద్వా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, మహిళలు

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి : ఐద్వా

ప్రజాశక్తి-పెనుకొండ

పెంచిన గ్యాస్ ధరను తక్షణం తగ్గించాలని ఐద్వా జిల్లా నాయకురాలు గౌతమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగర పంచాయతీలోని తిమ్మాపురం వద్ద ఐద్వా మహిళలు జండాలు ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు గౌతమి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలపై మోపుతున్న భారాలను అరికట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చమురు కంపెనీ యజమానుల లాభాలు తప్ప పేద , మధ్య తరగతి ప్రజల గురించి ఆలోచించడం లేదని మండిపడ్డారు. గ్యాస్ , పెట్రోల్ , డీజిల్ ధరలు పెంచి పేద ప్రజలపై ఆర్థిక భారం మోపుతోందని ఆరోపించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గ్యాస్ ధరల పెంపును ఏమాత్రం ప్రశ్నించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉచితంగా ఇస్తామన్న గ్యాస్ అందరికీ అందే విధంగా సమీక్ష చేసే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ఏ కుటుంబానికి ఉచితంగా గ్యాస్ అందుతున్నదో ఎవరికీ సబ్సిడీ నగదు జమవుతున్నదో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వాలు పేద , మధ్యతరగతి ప్రజలపై వేస్తున్న ఆర్థిక భారాల మీద రాబోవు కాలంలో ఐద్వా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామనిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు అరుణ , అమృత , మంజుల , గాయత్రి , నాగమణి , కాంతమ్మ , ముత్యాలమ్మ , హనుమక్క , సుకన్య తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కూటమి ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. రామకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ధర్మవరం ఏపీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్ హెచ్ భాష, సిఐటియు నాయకులు జేవి రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేతలకు అనేక హామీలు ఇచ్చిందే తప్ప అమలు చేయలేదన్నారు. చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయలేదన్నారు. నేతన్న నేస్తం అమలు చేయాలని, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలని, వర్క్ షెడ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, చేనేత కార్మికుల్లో 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కేవలం ప్రకటనలు చేస్తే సరిపోదని అమలు చేయాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంపు హరి, వెంకటస్వామి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగన్.. శవ రాజకీయాలు మానుకో.!

◆ ఐదేళ్ల పాటు ప్రజాకంఠక పాలన

◆ పోలీసులే గుడ్డలూడదీస్తారు జాగ్రత్త..

◆ మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ఎంఎస్.రాజు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఐదేళ్ల పాటు వైసిపి ఆధ్వర్యంలో ప్రూజా కంఠక పాలన సాగింది. ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. అన్ని రంగాల్లో రాష్ట్రం అల్లకల్లోలం అయ్యింది. ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కక్షలు రేపేందుకు ప్రయత్నిస్తున్నావ్.. ఇలాంటి శవ రాజకీయాలు మానుకుంటే మంచిది.' అని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో క్షణికావేశంలో జరిగిన గొడవలో వ్యక్తి చనిపోతే దాన్ని రాజకీయం చేస్తూ జగన్మోహన్‌రెడ్డి శవ రాజకీయాలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. తన రాజకీయ స్వార్థం కోసం జగన్‌రెడ్డి రాష్ట్రంలో శవాలు ఎక్కడ కన్పిస్తాయా అని ఎదురుచూస్తున్నారని తెలిపారు. పరామర్శల పేరుతో కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వైసిపి పాలన హత్యలకు గురైన బిసిలు, దళితులు, మైనార్టీల కుటుంబాలను జగన్ పరామర్శించాలన్నారు. ఐదేళ్ల పాటు నియంత పాలన సాగించిన ఆయన ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్య పాలన చేస్తున్నారనే కాబట్టే జగన్ హెలీక్యాప్టర్‌లో వచ్చి వెళ్లగలిగారన్నారు. జగన్ పర్యటను అడ్డుకోవాలంటే తమకు పెద్ద కష్టం ఏమీ కాదన్నారు. పోలీసులను గుడ్డలూడదీస్తామంటూ మాట్లాడుతున్న జగన్‌కు పోలీసులే గుడ్డలూడదీసే రోజులు వస్తాయన్నారు. జగన్ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.

నిష్పక్షపాతంగా పోలీసుల విధి నిర్వహణ

ఎస్పీ వి.రత్న

ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పర్యటనలో పోలీసులు ఎంతో సంయమనంతో వ్యవహరించిన నిష్పక్షపాతంగా విధులు నిర్వహించారని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు పోలీసుల భద్రతా చర్యపై ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆమె మంగళవారం నాడు విలేకరులతో మాట్లాడి వివరణ ఇచ్చారు. పాపిరెడ్డిపల్లి చిన్న గ్రామం కావడం అనుమతి లేని వారు ఎవరూ రావొద్దని ముందస్తుగానే సూచించామన్నారు. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియా ద్వారా ప్రజలను సమీకరించారన్నారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే విధంగా బస్, లారీలు, పోలీసులు ఆపితే ఆగకుండా నడిచి అయినా రావాలని పిలుపు నివ్వడం కూడా అధిక జనం పోగుకావడానికి కారణం అయ్యిందన్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించి పూర్తి స్థాయి భద్రత కల్పించినప్పటికీ నిర్వాహకులు నిబంధనలు పాటించ లేదన్నారు. కార్యక్రమంలో 1100 మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. హెలిప్యాడ్ వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో 250 మండి సిబ్బందిని నియమించి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలియజేశారు. వైసిపి వారే హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకున్నారని, దానికి వారే సాంకేతిక లోపం చూపించి కావాలనే రోడ్డు మార్గాన జగన్ వెళ్లారన్నారు. ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారమే ఆయన రోడ్డుమార్గాన బెంగుళూరు వెళ్లినట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు అన్ని జాగ్రలు తీసుకున్నారని ఎస్పీ స్పష్టం చేశారన్నారు.

చిన్నన్నపల్లిలో తాగునీటి సమస్య

వ్యవసాయ బోరుబావి వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని చిన్నన్నపల్లి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ఆగ్రామస్తులు కోరుతున్నారు. ఆరు రోజుల నుండి గ్రామంలో నీటి సమస్య నెలకొందన్నారు. నీటి కోసం మహిళలు నానా కష్టాలు పడుతున్నారన్నారు.కిలోమీటర్ల దూరంలో ఉన్న రైతుల బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామన్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి, ఇఒఆర్‌డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కన్పించలేదన్నారు. ఎక్కడా నీటి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్ల ద్వారా క్రింది స్థాయి అధికారులకు పదేపదే ఆదేశాలిచ్చినా మండలంలోని అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిన్నన్నపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కురుబలపై వైఎస్ జగన్‌ది మొసలి కన్నీరు

రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కురుబ కులస్తులపై మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ ఆరోపించారు. అధికారంలో ఉన్న సమయంలో బీసీలకు ఏమాత్రం న్యాయం చేయని జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారన్నారు. హత్య కు గురైన కురుబ లింగమయ్య కుటుంబాన్ని రాప్తాడుకు వచ్చి పరామర్శించడం సరైందేనన్నారు. అయితే గత వైసిపి ప్రభుత్వంలో అదే రాప్తాడు నియోజకవర్గం లో కురుబ అలివేలమ్మను వైసిపి కార్యకర్తలు దాడి చేస్తే ఆ రోజు ఎక్కడికి పోయారనిప్రశ్నించారు. ఇదే జిల్లాలో ఏపీ పాల డైరీ డిప్యూటీ డైరెక్టర్ కురుబ శ్రీనివాసులు పై వారిపార్టీ ఎమ్మెల్యే తో అక్రమ కేసు పెట్టించి అయన చావుకి కారణం అయ్యారని ఆరోపించారు. అధికారంలో ఉంటే ఒకరకంగా, అధికారం కోల్పోతే మరో రకంగా వ్యవహరించడం జగన్మోహన్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఆయన పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అనేక మందిపై దాడులు చేసినా పట్టించుకోని జగన్మోహన్ రెడ్డి ప్రస్తుతం ఆయా వర్గాలపై ఎక్కడ లేని ప్రేమ చూపిస్తూ రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పోలీసులను బట్టలు ఊడదీసి నడిరోడ్డుపై నిలబెడతానని అవమాన పరిచే విధంగా మాట్లాడిన జగన్మోహన్ రెడ్డి అదే పోలీసులు లేకపోతే పాపిరెడ్డి పల్లికి ఎలా వచ్చారో ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని దాన్ని జీర్ణించుకోలేక జగన్మోహన్ రెడ్డి ఇలా రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారని అన్నారు.

ఫాదర్ ఫెర్రర్ జయంతికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్–ఫెర్రర్ జయంతి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లును సిద్ధం చేస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్ ప్రమీల తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఫాదర్ ఫెర్రర్ ఘాట్‌ను ముస్తాబు చేస్తున్నారు. జయంతిని పురష్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు. ఇండియా ఫర్ ఇండియా పేరుతో ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించి కొత్త హుండీలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకుగాను బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో దాదాపు 4వేలు పైచిలుకు హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్ధనలు ఆనంతరం సందేశాలు వినిపిస్తారు. వివిధ గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణ పరిధిలోని గుట్టకిందపల్లి లో గల ఏపీ మోడల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పద్మశ్రీ తెలిపారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సీఇసీ, ఎంఈసి గ్రూపులు ఉన్నాయన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వైసిపిలోకి షిర్డీసాయి గ్లోబల్‌ట్రస్టు చైర్‌పర్సన్ శిల్ప ..?

పెనుకొండ సమన్వయకర్త ఆమే అంటూ ప్రచారం
ట్రస్టుపేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహణ
రెడ్డి సామాజిక వర్గం, కడపవాసి కావడంతో అవకాశం

ప్రజాశక్తి-పెనుకొండ

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ శిల్ప ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. నెలరోజుల నుంచి ఈ ప్రచారం సాగుతోంది. శిల్ప ట్రస్టు పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో మంచి స్థానం సంపాదించుకున్నారు. మాజీమంత్రులు మాలగుండ్ల శంకరనారాయణ, ఉషశ్రీచరణ్ పెనుకొండ స్థానం తనదంటే తనది అంటూ చెప్పుకుంటున్నారు. నియోజకవర్గంలో వైసీపీ రెండు గ్రూపులుగా విడిపోయింది. దీంతో పార్టీ క్యాడర్ అయోమయంలో కొట్టుమిట్టాడుతోంది. వీరిద్దరిని కాదని కొత్తవారిని సమన్వయకర్తగా నియమించాలని నాయకులు, కార్యకర్తలు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి కొత్త వారిని కోసం గాలింపు చేపట్టినట్లు సమాచారం. ప్రజాదరణ, డబ్బు, వర్గా విభేదాలు, అందరినీ కలుపుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేసేవారి కోసం చూస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

ట్రస్టుపేరుతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహణ

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్టు పేరుతో శిల్ప పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందిస్తున్నారు. పాఠశాల ఫీజులు ట్రస్టు చెల్లిస్తోంది. ప్రతి ఏటా జనవరిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. వేలాది మంది పేదలకు ఉచిత కంటి వైద్యం, చెవి, ముక్కు వైద్యం అందిస్తున్నారు. అవసరమైనవారికి ఉచితంగా వినికిడి యంత్రాలు, కంటి శస్త్ర చికిత్సలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఇటీవల పోలీసులకు సీసీ టీవీల కోసం రూ.28 లక్షల విలువైన చెక్కును అందించారు. అపదలో ఉన్న వారికి చేయూతనందిస్తు అందిరి మనస్సుల్లో స్థానం సంపాదించుకున్నారు.

పెనుకొండ సమన్వయకర్త అమే అంటూ ప్రచారం...

నియోజకవర్గంలో ఉషశ్రీచరణ్ తానే ఎమ్మెల్యే అభ్యర్థిని అంటూ ప్రచారం చేసుకుంటోంది. మరో పక్క మాలగుండ్ల శంకరనారాయణ మౌనంగా తన పని తాను చేసుకుపోతున్నారు. వీరిద్దరిని పార్టీశ్రేణులు వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శిల్ప పేరు తెరపైకి వచ్చింది. పేరు, డబ్బు పలకుబడి ఉన్న ఆమె పెనుకొండకు సమన్వయకర్త అయితే పార్టీ తిరిగి పుంజుకుంటుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసిన పెనుకొండ సమన్వయకర్త శిల్ప నే అంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. ఇంత జరుగుతున్నా వైసిపి అధిష్టానం, ట్రస్టు సభ్యులు ఎక్కడ ఖండించకపోవడం గమనార్హం.

రెడ్డి సామాజిక వర్గం, కడప వాసి కావడంతోనే అవకాశం..

ట్రస్టు చైర్‌పర్సన్ శిల్పది రెడ్డి సామాజికవర్గం. ముఖ్యంగా ఆమె కడప వాసి కావడమే ఆమె కు పెనుకొండ సమన్వయకర్తగా అవకాశం కలిసి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో బీసీలు అధికంగా ఉన్నారు. మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ కురుబ సామాజిక వర్గం కావడంతో 2019లో పెనుకొండ ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రి అయ్యారు. ప్రస్తుతం మాలగుండ్లను రెడ్డి సామాజిక వర్గం నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2024లో పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన ఉషశ్రీ చరణ్ ఘోరంగా ఓటమి పాలమయ్యారు. ఈమెది కురుబ సామాజికవర్గం, భర్త చరణ్ రెడ్డి సామాజిక వర్గం కావడంతో కలసి వస్తుందని భావించిన జగన్మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గం నుంచి ఉషశ్రీచరణ్‌ను పెనుకొండకు తీసుకువచ్చారు. మాలగుండ్లను అనంతపురం పార్లమెంట్‌కు పంపారు. ఉషశ్రీ చరణ్ వ్యవహారం నచ్చని వైసిపి నాయకులు, కార్యకర్తలు మాలగుండ్ల చెంతకు చేరారు. నియోజకర్గంలో వైసిపి రెండు వర్గాలుగా విడిపోయింది. ఈ నేపథ్యంలో వీరిద్దరు వద్దని కొత్త వారు కావాలని నియోజకవర్గం లోని నాయకులు, కార్యకర్తలు కోరుకుంటున్నారు. దీంతో శిల్పను వైసిపిలో చేర్చుకుని పెనుకొండ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వైసిపి శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి.

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని తహశీల్దార్ దేవేంద్రనాయక్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు సిబ్బంది స్వర్ణకుమారి,సున్నుబాషా ఉద్యోగోన్నతిపై వెళ తున్న సందర్భంగా వారికి మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా ఉద్యోగి తమ విధులు సక్రమంగా నిర్వర్తించినప్పుడే ప్రజలు, ఉన్నతాధికారుతో మంచి పేరు సంపాదించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి, ఈవోఆర్డీ మాధవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, రైతు సేవా సిబ్బంది అంజి నాయక్, ఇంతియాజ్, నరసింహారెడ్డి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని నర్సంపల్లి పంచాయతీ బూడిద గడ్డపల్లిలో కోటిన్నర రూపాయలతో నూతనంగా నిర్మించిన శ్రీ పట్టాభి రామచంద్ర ఆలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదే గ్రామానికి చెందిన యూఎస్‌ఏ లో స్థిరపడిన శేషాద్రి రెడ్డి దంపతులు ఆధ్వర్యంలో నూతన ఆలయ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీలో నిర్వహిస్తున్న శ్రీ యోగి వేమన బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ పీఠాధిపతి తుంగ వేమారెడ్డి తెలిపారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

అర్హులైన వారికి మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి సత్యకుమార్‌యాదవ్ మంగళవారం పంపిణీ చేశారు. మొత్తం 20 మంది లబ్ధిదారులకు రూ. 18,81,558 విలువైన చెక్కులను అందజేశారు.

ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుపై రాయితీ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీలో ముందస్తు ఆస్తి పన్ను ఏక మొత్తంలో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని కమిషనర్ ప్రహల్లాద తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు ఏక మొత్తంలో ఒకే సారి చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చు అన్నారు. ఈనెల 30వ తేదీలోగా చెల్లించిన వారికి మాత్రమే రాయితీ వర్తిస్తుందన్నారు.

పోట్లమర్రిలో బోనాలు

బత్తలపల్లి :మండలంలోని పోట్లమర్రి గ్రామంలో గ్రామ దేవతలకు గ్రామస్తులు మంగళవారం బోనాలు సమర్పించారు. గ్రామంలోని నల్లలమ్మ ఆలయాన్ని అలంకరించారు. అదేవిధంగా గుమ్మల్లకుంట గ్రామంలోనూ భైరవునికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, ANANTAPURAMU

E.P. No:709/2024 in A.C.No.KSG/SF/86/2019

Between:

M/S SUNDARAM FINANCE LIMITED., Rep. by its Authorised Signatory, Sri P.K. Balaji Kumar, Sr. Branch Manager, Anantapuramu.

...D.Hr /Claimant

And

A. Rajasekhara Reddy and Others

...J.Drs/ Respondants

J.Drs 02 to 03 Order 21 Rule 43 CPC Notice

J.Dr No:2: Mr. M. Ravindra Reddy S/o M. Chenna Reddy, R/at D.No.1/21A, Thummala, Dharmavaram, Sri Sathya Sai Dist.

J.Dr No:3: Mr. K.Srinivasa Reddy S/o M.Chenna Reddy, R/at D.No.29-27-1, Maruthi Nagar, Dharmavaram, Sri Sathya Sai Dist.

Petitioner బాకీ రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు చేసిన E.P.లో 02 మరియు 03వ J.Drs అయిన మీ హాజరు నిమిత్తము 15-04-2025వ తేదిన హాజరు అగుటకు గాను వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 10:30 గం॥లకు పై కోర్టువారి ఎదుట ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(By order of the Court)

R.Rama Kumar, K.V Ramana Reddy

Advocates, Ananthapuram.

టిడిపిలో 15 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని రామిరెడ్డి పల్లిలో 15 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు. రామిరెడ్డి పల్లి లో టిడిపి కార్యకర్త అంజి ఇంటిలో జరిగిన శుభకార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే ,మాజీ మంత్రి సమక్షంలో గ్రామానికి చెందిన వైసిపి నాయకులు టీడీపీలో చేరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని వైసిపి నుంచి టీడీపీలోకి చేరిన శ్రీనివాసులు, నరసింహులు లక్ష్మీదేవి ,నాగభూషణ మహాలక్ష్మి, కవిత వెంకటరమణమ్మ బ్రహ్మయ్య రాములమ్మ రామచంద్ర ,నిడిమామిడి సురేష్ ,గంగ, సునీల్ తదితరులు తెలిపారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ పరిధిలోని మోటుమర్ల గ్రామంలో గల కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో ఆరవ తరగతికి ,ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఏ. చంద్రకళ కోరారు. 2025-26 విద్యా సంవత్సరముకు గాను ప్రవేశాల కొరకు దరఖాస్తులను స్వీకరించడానికి నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు.

ఆర్థికాభివృద్ధికి బ్యాంకుల తోడ్పాటు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఆర్థిక స్వావలంబనకు బ్యాంకుల పాత్ర కీలమమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం పిఎంఇజిపి, పిఎం విశ్వకర్మ, ముద్రా లోన్లు, బీసీ కార్పొరేషన్ లోన్లు తదితర సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఐసి జనరల్ మేనేజర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అన్ని సామాజిక వర్గాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో బ్యాంకులు మరింత చురుకైన పాత్రను పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు కేవలం కాగితాల్లో కాకుండా, అర్హులైన లబ్ధిదారులకు సమయానికి అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. బ్యాంకులు వేగంగా లోన్ ప్రాసెసింగ్ చేయాలన్నారు. స్వయం ఉపాధికి తోడ్పడే పథకాలను మరింత ప్రజల వద్దకు తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని సూచించారు. ముఖ్యంగా యువత, మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు ఈ పథకాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. డిఐసి, బ్యాంకులు, ఇతర శాఖల సమన్వయంతో పథకాల అమలులో వేగం పెరుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఐసి జనరల్ మేనేజర్, ధర్మవరం నియోజకవర్గం లోని అన్ని బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసనలో నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి - గోరంట్ల

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ రంగ కార్మికులు మంగళవారం స్థానిక బస్టాండ్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న లేబర్ కోడ్‌ల వల్ల భవన నిర్మాణ కార్మికులకు నష్టదాయకమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొండా వెంకటేశులు, నాగభూషణం కెవిపిఎస్ గోవిందు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి బాబాజాన్, కోశాధికారి మహబూబ్‌బాషా, సిఐటియు మండల నాయకులు ముద్దుల వెంకటరమణప్ప, నాగరాజు, రామాంజనేయులు, సురేష, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు

స్వయం శక్తితో మహిళలు ఉపాధి పొందాలి

వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

కూటమి ప్రభుత్వం కల్పించిన ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏపీ బీసీ కార్పొరేషన్ ఆర్థిక సహాయంతో మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణను వారు పరిశీలించారు. ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర ,మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి, తుమ్మల మహబూబ్ బాషా, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచి శంకర్ రెడ్డి, నిజాం, ఓబుల్ రెడ్డి , పీట్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

వికలాంగుల్లో ఉన్న ప్రతిభను వెలికితీద్దాం

కొత్త చెరువు : వికలాంగుల్లో ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకొద్దామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. సత్యసాయిజిల్లా విద్యా శాఖ సమగ్ర శిక్ష సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కొత్త చెరువు మండల కేంద్రంలోని సత్యసాయి బాబా భజన మందిరంలో వికలాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వికలాంగుల అభివృద్ధికి పెద్ద పీట వేసిందని పేర్కొన్నారు. అనంతరం సుమారు 227 మంది వికలాంగులకు ట్రై సైకిళ్ల ,వీల్ చైర్లు ,వినికిడి యంత్రాలు, రో లెటర్లు బ్రైయిలీ కిట్స్ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కిష్టప్ప, సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి దేవరాజ్, ఆనంద్, అరుణ, లలిత, టిడిపి మండల కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ జెడ్పిటిసి లక్ష్మీనారాయణ, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచి మాణిక్యం బాబా తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మెరుగైన వైద్య సేవలు

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - తాడిమర్రి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మొబైల్ మెడికేర్ ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి సత్య కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించిందన్నారు. కూటమి ప్రభుత్వ హాయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఇలాంటి వైద్య సేవలు అధునాతనంగా నిర్వహించిన సిఇఒ సంఘమిత్ర కి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొ రేషన్ డైరెక్టర్ కష్ణంరెడ్డిపల్లి కాటమయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంకా నాగార్జున, ఆర్డీవో, తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హంద్రీనీవా వెడల్పు తర్వాతే లైనింగ్ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-హిందూపురం

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ప్రధాన కాలువ వెడల్పు చేసిన తర్వాతే లైనింగ్ పనులను చేపట్టాలని ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. హంద్రీనీవా పథకం కాలువకు సంబంధించి మంత్రి చెబుతున్న మాటల్లో ఎంత మేరకు నిజముందో అర్థం కావడం లేదన్నారు. 20 సంవత్సరాల తర్వాత మొదటగా హంద్రీ-నీవాకు పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయించి పనులు జరుపుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చెప్పినట్లు 12 పంపులు కొడితే ఎన్ని క్యూసెక్కులు బయటికి వస్తాయి, మంత్రి అనుకున్నట్టు తొమ్మిది పంపులు కొడితే ఎన్ని నీళ్లు బయటకు వస్తాయో తెలిసిందేనన్నారు. 1కష్ణా నదికి గ్యారంటీ వరద కాలం 40 రోజులు అంటే 40 రోజులలో 40 టీఎంసీలు తీసుకురావాలంటే రోజుకు ఒక టీఎంసీ బయటకు రావాలన్నారు. ఒక టీఎంసీ రావాలంటే కాలువ సామర్థ్యం 11వేల క్యూసెక్కులు ఉండాలి, 13 పంపులు పూర్తి పూర్తిస్థాయిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అలాగే మొదటి ఫేజ్ లో 3,800 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ వెడల్పు చేస్తున్నామని రెండవ ఫేజ్ కింద మాత్రమే లైనింగ్ పనులు చేస్తున్నామంటున్నారని, అంటే సత్యసాయి జిల్లా, మంత్రి జమానాలో లేనట్లా లేదా అని ఆయన ప్రశ్నించారు. రెండవ ఫేజ్ కింద లైనింగ్ చేస్తున్న కాలువ సామర్థ్యం ఎంతో కూడా మంత్రే చెప్పాల్సి ఉంటుందన్నారు. కనీసం మొదటి ఫేజ్ కింద చేస్తున్నట్లు 3800 క్యూసెక్కుల సామర్థ్యంతో రెండవ ఫేజ్ కాలువను కూడా వెడల్పు చేసిన తర్వాతనే లైనింగ్ చేయాలని కోరారు. కృష్ణానది వరద నీరు సముద్రం పాలు కాకుండా శ్రీశైలం వెనుక భాగంలో ఇప్పటికే ప్రభుత్వం భూమిని సేకరించిన సిద్దేశ్వరం-అలుగు ఎత్తిపోతల పథకానికి రోడ్ కం చెక్ డామ్ నిర్మించడం వల్ల కృష్ణ వరదను, గుండ్రేవుల ప్రాజెక్టు, వరద కాలవ నిర్మాణం వల్ల తుంగభద్ర వరదను ఒకేసారి ఆపిన వారమవుతామని పేర్కొన్నారు. తద్వారా రాయలసీమను సస్యశ్యామలం అవుతుందన్నారు. అలాగే గత వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు గాలేరు-నగరిని, హంద్రీ-నీవాకు అనుసంధానం చేయడం వల్ల హంద్రీ-నీవా ద్వారా చిత్తూరుకు వెళ్లే నీటిని అనంతపురం జిల్లాకు మళ్లించుకోవచ్చని తెలిపారు. తమది రాజకీయ పార్టీ కాదని, ఒక ప్రజా సంఘంగా జిల్లా సమగ్ర అభివృద్ధిపై శ్రద్ధతో నిర్మాణాత్మకమైన సలహాలు ఇస్తున్నామన్నామని అన్నారు. హంద్రీ-నీవా రెండవ ఫేజ్ కూడా కాలువ వెడల్పు చేసిన తరువాతనే లైనింగ్ పనులు చేపట్టాలని, లేనిపక్షంలో రెండవ దశ కాలువ డ్రైనేజీ కాలువగామారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రిగా పయ్యావుల కేశవ్ ఈ జిల్లా ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకొని ఎడారిగా మారుతున్న ఈ జిల్లాను, అలాగే అత్యంత వెనుకబడిన రాయలసీమను కాపాడాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్ పరిధిలోని కనగానపల్లి మండలం మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన నీలమ్మ(32) అనే వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు... నీలమ్మ భర్త మురళి డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నేపథ్యంలో నీలమ్మ మంగళవారం తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈమె మృతికి భర్త వేధింపులే కారణమని నీలమ్మ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నీలమ్మకు ఒక కుమారుడు ఉన్నాడు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కనగానపల్లి పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మాజీ ఎంపీపీ వేలూరుమాలతి తోట సమీపంలో మంగళవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆకతాయిలు పెట్టిన నిప్పుకు చీనీ, టెంకాయ, నేరేడు చెట్లు కాలిపోయాయి. తోట సమీపాన ఉన్న గురమల్లయ్య గుట్టకు ఆకతాయిలు నిప్పుపెట్టడంతో తోటకు వ్యాపించి కాపుకొచ్చిన 100 టెంకాయ, 60 చీనీ, 10 నేరేడు చెట్లతోపాటు డ్రిప్పు పైపులైన్లు కాలిపోయాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని సాగురైతు జయచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కదిరి అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలు ఆర్పారు.

ట్రాక్టర్ బోల్తా... తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక వైఎస్ఆర్ విగ్రహం ముందు మంగళవారం కట్టెల ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. అయితే రద్దీగా ఉన్న ఈ ప్రదేశంలో ఆసమయంలో ఎవరూ అక్కడ లేకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. కర్నాటక రాష్ట్రం తండాకు కు చెందిన ట్రాక్టర్ కట్టెలు వేసుకుని కాలేజీ రూటు నుంచి పావగడ వైపునకు వెళుతోంది. వైఎస్ఆర్ సర్కిల్ వద్ద రోడ్డు పూర్తిగా హెచ్చు తగ్గులు ఉండడంతో ఇంజన్ దిగిన అనంతరం ట్రాలీ దింపే ప్రయత్నంలో లోడు మీదున్న ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. ఆసమయంలో అక్కడ ఎవరూ లేనందున పెద్ద ప్రమాదం తప్పింది.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లి లో దాడులు నిర్వహించి వెంకటేష్,, ఊటుకూరు గ్రామంలో జగదీష్, సురేష్, చిలవత్తూరు మండలం కోడూరు లో ఆదినారాయణ, చాగలేరులో నారాయణప్పను అరెస్టు చేసినట్టు సిఐ తెలిపారు. వీరివద్దనుంచి కర్నాటకకు చెందిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పృథ్వీరాజ్, ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, వెంకటేష్, రమణ, సతీష్, కానిస్టేబుళ్లు అంజి, రవీంద్ర, సురేష్, కుమార్, రంగధామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన రైతు నంబూరి ప్రసాద్ కుటుంబాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి , మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. ఈ మేరకు వారు నంబూరు ప్రసాద్ అంత్యక్రియలకు హాజరయ్యారు. పుట్టపర్తి మండలం రాచువారి పల్లి గ్రామానికి చెందిన రైతు నంబూరి ప్రసాద్ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి మంగళవారం ఆ గ్రామానికివెళ్లి ప్రసాద్ అంత్యక్రియలలో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వీరాభిమాని మృతి తమను దిగ్భ్రాంతిని గురి చేసిదన్నారు. ప్రసాద్ కుటుంబానికి అన్ని విధాలుగా తెలుగుదేశం పార్టీ తో పాటు పల్లె కుటుంబం అండగా ఉంటుందని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ బొమ్మయ్య, స్థానిక సర్పంచి, టిడిపి నాయకులు సుభాస్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

క్షయ వ్యాధిగ్రస్తులతో సన్నిహితంగా ఉండే వ్యక్తులకు క్షయ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు అన్నారు. ఈ మేరకు మంగళవారం క్షయ వ్యాదిగ్రస్తులతో పాటు వారితో సన్నిహితంగా ఉన్న వారికి టీ బీ పరీక్షలు పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. క్షయ నివారణ వైద్యాధికారి డాక్టర్ గాయత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పుట్టపర్తి వైద్యాధికార్లు డాక్టర్ జోత్స్న డాక్టర్ మునిచంద్రిక అధ్వర్యంలోక్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, లలిత కుమారి, స్టాఫ్ నర్స్ పద్మావతి, ల్యాబ్ టెక్నీషియన్ సునీత ,డిటిసి సూపర్వైజర్ అబీద్ బాషా, రాజేశ్వరి, ఎఎన్ఎం పరిమళ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - లేపాక్షి

అధికారులు, నాయకులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ వ్యక్తి గత కార్యదర్శి వీరయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మండలం కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం స్థానిక నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా పంచాయతీల వారీగా, శాఖల వారీగా సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపీడీవో నరసింహ మూర్తి, టీడీపీ మండల కన్వీనర్ జయప్పతో పాటు ఆయాశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అదనపు తరగతులు నిర్వహించొద్దు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణ గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలల్లో ప్రస్తుతం ఒంటిపూట బడులు జరుగుతున్నాయి ఈ క్రమంలో మధ్యాహ్నం నుండి అదనపు తరగతులు నిర్వహించరాదని ఎంఇఒలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున, విద్యార్థులు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. అదనపు తరగతులు ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ పాఠశాలలలోనూ, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో నిర్వహించరాదనిస్పష్టం చేశారు. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు నడుపుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. వెంటనే అదనపు తరగతులను తొలగించాలని లేకపోతే డిఇఒ ఆదేశాల మేరకు ఆ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సకాలంలో రేషన్ అందించాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని కార్డుదారులకు సకాలంలో రేషన్ సరుకులు అందించాలని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒకటవ తారీఖు నుంచి బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. సకాలంలో ప్రజలకు సరుకులు అందడంలేదని ఆరోపించారు. ఈ పాస్ మిషన్ల సమస్యలతో మరింత జాప్యం అవుతోందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే ఆధిపత్యం

ప్రజాశక్తి - పావగడ

కర్నాటక స్కూల్ ఎగ్జామినేషన్ అండ్ ఎవాల్యుయేషన్ బోర్డు(ఇంటర్ బోర్డ్) మంగళవారం ద్వితీయ పీయూసీ పరీక్ష-1 ఫలితాలను ప్రకటించింది. పట్టణంలోని ఎస్ఎస్‌కె. కళాశాలకు చెందిన విద్యార్థిని కావ్య 558 మార్కులు సాధించి కామర్స్ విభాగంలో తాలూకా పరిధిలో ప్రథమ స్థానం సంపాదించింది, వివేకానంద కాలేజీకి చెందిన సౌందర్య 568 మార్కులు సాధించింది . సైన్స్ విభాగంలో తాలూకా పరిధిలో ప్రథమ స్థానంసంపాదించింది. పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆర్ట్స్ విభాగంలో యశోదమ్మ 571 మార్కులు, సైన్స్ విభాగంలో అంజలి టీ.ఆర్ 490 మార్కులు, వాణిజ్య విభాగంలో సుప్రజ 545 మార్కులు సాధించారని ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు.